క్లుప్తంగా

20న విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపాలపట్నం: గోపాలపట్నం పెట్రోల్ బంక్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.నీ కారణంగా గోపాలపట్నం బంక్ ఏరియా, నరసింహానగర్, రామకృష్ణా నగర్, శ్రీనివాసనగర్, గణేష్‌నగర్, ఇందిరానగర్, లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో ఈ నెల 20న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పలువురు డైరెక్టర్లకు సత్కారం

మల్కాపురం: వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నియమితులైన వారిని బుధవారం టీఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు నక్క లక్ష్మణరావు సత్కరించారు. 61వ వార్డు ఆర్‌కేపురంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జిసోమేష్‌ను, ఏఎంసీ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీనుతో పాటు మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సలీమను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



పూజల్లో పాల్గొన్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్‌లో భగవాన్ విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి మదన్, బీజేపీ నాయకుడు కె.గురుమూర్తి విశ్వకర్మ చిత్రపటానికి పూజలు జరిపారు. అతని చిత్రం పటం వద్ద పని ముట్లు ఉంచి పూజలను జరిపారు.అనంతరం కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ జీవన ప్రతిబింబం జానపద సాహిత్యం



ప్రసంగిస్తున్న కవి రెడ్డి రామకృష్ణ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'జానపద గేయాలు, సామాజిక అంశాలు' అనే అంశంపై కవి రెడ్డి రామకృష్ణ ప్రసంగించారు. జానపద గేయాల్లో ఆర్థిక, సామాజిక అంశాలు అనేకమున్నాయన్నారు. మహిళ, పురుష సంబంధాలు.. ముఖ్యంగా ఆస్తి సంబంధాల విషయంలో ఒకనాటి సమాజం ఎలా ఉండేదో చెబుతాయన్నారు. అద్భుతమైన సాహిత్య విలువలతో వచ్చిన జానపద గేయాలు, సాహిత్యం నేటికీ అవసరమేనని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఒకనాటి గ్రామీణ జీవనం , చరిత్రను తెలుసుకోవడానికి జానపద సాహిత్యం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిహెచ్.చిన సూర్యానారాయణ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, భాగవతుల సత్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, ఎం.పరమేశ్వరరావు, పిల్లా శివాజి, గుంటూరు సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

పోర్టులో స్వచ్ఛత పక్వాడా



పరిసరాలను శుభ్రం చేస్తున్న పోర్టు సిబ్బంది

మహారాణిపేట: విశాఖ పోర్టు అథారిటీలో బుధవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం సాంబమూర్తి ఆడిటోరియంలో, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్(ఏవోబీ)లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీపీఏ ఉపాధ్యక్షుడు దుర్గేష్ కుమార్ దుబే, అన్ని విభాగాధిపతులు, ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏవోబీ పరిసరాలలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ కార్యదర్శి టి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

మరమ్మతులు చేసినా.. మళ్లీ గుంతలు

7 నెలల క్రితమే సర్వీస్‌రోడ్డులో పనులు • అంతలోనే మళ్లీ గోతులు

నాణ్యత ప్రశ్నార్థకం • వాహనదారులకు నరకం



కోస్ట్‌గార్డ్ కార్యాలయం ఎదురుగా గల సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన గుంత



మల్కాపురం పోర్టు క్వార్టర్ బస్టాప్ వద్ద ఏర్పడిన గుంత వద్ద వాహనాలు దిగకుండా పెట్టిన స్టాపర్లు

మల్కాపురం: ఆ మార్గంలో ప్రయాణం చేయాలంటే వాహనదారుల్లో ఒకటే కలవరం. సర్వీస్ రోడ్డులో అడుగుకో గుంత ఉండటంతో ఎప్పుడు ఏ గుంతలో పడి, ప్రమాదానికి గురవుతామో అని ఆందోళన. 7 నెలల క్రితమే రోడ్డుకు మరమ్మతులు చేసినా.. ఇంతలోనే గుంతలు మళ్లీ ప్రత్యక్షం కావడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంత ప్రధాన సేవా మార్గంలో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. 61వ వార్డు మల్కాపురం బస్టాప్ నుంచి పోర్టుక్వార్టర్ బస్టాప్ మీదుగా ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఈ సమస్య అధికంగా ఉంది.

నాణ్యత డొల్ల

మల్కాపురం, మల్కాపురం మరిడిమాంబ ఆలయం ఎదురుగా గల సర్వీస్ రోడ్డు, పోర్టు క్వార్టర్స్ బస్టాప్, నేవల్ క్వార్టర్ సర్వీస్ రోడ్డు, కోస్ట్‌గార్డ్ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల సర్వీస్ రోడ్డు .. ఇలా పలు ప్రాంతాలలోని సర్వీసు రోడ్లలో ఆరు అంగుళాల లోతు నుంచి అర అడుగు లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఏడు నెలల క్రితం గుంతల ఏర్పడిన చోట్ల అధికారులు బీటీ రోడ్డు వేశారు. పనులు చేసినా.. నెలల వ్యవధిలోనే అదే సమస్య పునరావృతమైంది. దీంతో రోడ్డు నాణ్యతపై అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఇవేమి పనులంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని కోరుతున్నారు.



నేవల్ క్వార్టర్ వద్ద గల సర్వీస్ రోడ్డుపై కాలువ మాదిరిగా ఏర్పడిన గుంత



మల్కాపురం మరిడిమాంబ ఆలయం ఎదురుగా గల సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన గుంత



మల్కాపురం సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన గుంత

డొల్లతనం బయటపడింది



పారిశ్రామిక ప్రాంత సేవా మార్గాల్లో రాత్రి సమయాల్లో విద్యుత్ లైట్లు వెలగవు. దీంతో రోడ్డుపై ఉన్న గుంతలను గుర్తించలేక గాయాల పాలవుతున్నాం. అడుగుకో గొయ్యితో చాలా అసౌకర్యానికి గురవుతున్నాం. మరమ్మతులు చేపట్టిన 7 నెలలకే నిర్మాణంలో డొల్లతనం బయటపడింది.

– చిన్నా రెడ్డి, ఆటో డ్రైవర్

ప్రయాణం నరకం



మల్కాపురం నుంచి ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో చాలాచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వీటిని గుర్తించలేక వాహనం అదుపు తప్పుతోంది, గాయాల పాలవుతున్నాం. అధికారులు ఈ సమస్యపై స్పందించి గుంతలు ఏర్పడిన సేవామార్గాల్లో మరమ్మతు పనులను చేపట్టాలి. లేదా కొత్తగా బీటీ రోడ్డు అయినా వేయించాలి.

–జి.బాబూరావు, వాహనదారుడు

అధినేతకు వివాహ ఆహ్వానం



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పెళ్లి పత్రిక అందిస్తున్న ఆల్ఫా కృష్ణ

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బీఎస్ కృష్ణ కుటుంబ సభ్యులతో సహా కలిశారు. తన కుమారుడు కార్తీక్ వివాహ ఆహ్వాన పత్రికను అధినేతకు అందించారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సింధియా: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీజేపీ నాయకులు బుధవారం గాంధీగ్రామ్ కార్మిక బీమా ఆస్పత్రి(ఈఎస్ఐ)లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పంచదార్ల అప్పలరాజు, ఆస్పత్రి ఇన్‌చార్జి ప్రభాకర్, మెడికల్ ఆఫీసర్ అర్చన, మండలాధ్యక్షులు సతీష్, రాజారావు, గుత్తుల మధుబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఇంకుడు గుంతల పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంచరపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని జీవీఎంసీ56వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ యు. కార్తీక్ అన్నారు. కంచరపాలెం దరి రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో బుధవారం 'స్వచ్ఛత పక్వాడా–2025' లో భాగంగా 'స్వచ్ఛత శపథం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల, గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో విద్యార్థుల ఆరోగ్యం బాగుటుందన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందిచే స్వచ్ఛత శపథంపై ప్రతిజ్ఞ చేయించారు. పక్షం రోజులు నిర్వహించే స్వచ్ఛతా పక్వాడాలో అందరూ భాగస్వాములు కావాలని హెచ్‌ఎం రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. పరిశుభ్రత, నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ, తరగతి గదుల శుభ్రత, వ్యాసరచన, కవితా రచన, స్వచ్ఛ, పాఠశాల గోడలపై స్వచ్ఛ భారత్ సందేశాల పెయింటింగ్స్, క్విజ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు, ఉపాధ్యాయులకు మెరిట్ అవార్డులు అందించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: వార్డు పరిధిలోని ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మనమంతా పోరాడుదామని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ములగాడ హౌసింగ్‌కాలనీలో బుధవారం వార్డు పార్టీ ఉపాధ్యక్షుడు ఎదుర సత్యనారాయణయాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, బూత్ కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వార్డు పరిధిలో జీవో నెంబర్ 296 పట్టాలు ఉన్న వారికి న్యాయంగా రిజిస్ట్రేషన్ పట్టాలు వచ్చేలా పని చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా అడుగులు వేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయా ప్రాంత సచివాలయాల ఉద్యోగులు,తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేయాలని కోరారు. ప్రజలతో మమేకమైతే వారు ఆశీర్వదిస్తారని చెప్పారు. ఇతర పార్టీల నాయకులతో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ప్రచార కమిటీ కార్యదర్శి ఎడ్ల సత్యనారాయణ,సంపత్‌కుమార్,ఖాన్,అర్జున్,పైడితల్లి,కోరాడ వాసు,బంగారు రాజు,శేఖర్,నందిని,మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వారధి జిల్లా స్థాయి పోటీలు



వ్యాసరచన, డిబేట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, ఎంసీహెచ్ స్కూల్‌లో బుధవారం వారధి జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ప్రతి మండలం నుంచి ఆయా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మొత్తం 22 టీమ్‌లు జిల్లా స్థాయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. డిబేట్‌లో నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సుహాని గీతికం గుల్షన్ ఫిర్దౌస్, ఉజ్వల గెలుపొందారు. గైడ్‌గా ఎస్‌ఆర్‌ఆర్‌ఎస్ నరసింహం వ్యవహరించారు. వ్యాసరచనలో గాజువాక ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీవల్లి, తనూజ, సాయి పూజిత గెలిచారు. నిర్మల టీచర్ గైడ్‌గా వ్యవహరించారు. విజేతలకు పాఠశాల హెచ్‌ఎం రాధాకుమారి అధ్యక్షత జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథి సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్ చేతుల బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి విజేతలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి పి.రాజారావు, ఏఎంవో జి.లక్ష్మి, జి.శ్రీదేవి, జ్యూరీ మెంబర్స్ శ్రీనివాసరావు, శ్యామల, టి.కిషోర్ వర్మ, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని కూర్మన్నపాలేనికి చెందిన భూపతిరాజు విశ్వనాథరాజు రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో రమణమూర్తి, ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సునీల్ బాండ్ అందించారు. ఆయనకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల శోభ

- వీధివీధినా ఉత్సవ రాటల ఏర్పాటు
- మండపాల ఏర్పాట్లు మరూ



హిమాచల్‌నగర్‌లో రాటకు పూజలు చేస్తున్న నాయకులు



గోపాలపట్నం శంకర థియేటర్ వద్ద పందిరి రాట వేస్తున్న శివ దుర్గా కమిటీ సభ్యులు



కరాసాలో పందిరి రాట వేస్తున్న రాక్ స్టార్ యూత్ సభ్యులు



ఎన్టీఆర్ కాలనీలో పందిరి రాట వేస్తున్న మహిళలు

గోపాలపట్నం: శరన్నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. దుర్గమ్మను పూజించేందుకు పోటాపోటీగా ఉత్సవ రాటలు ప్రతిష్టిస్తున్నారు. పోటాపోటీగా మండపాలు, విద్యుత్ లైటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఏ ప్రాంతంలో చూసినా ఆధ్యాత్మిక సందడి కనిపిస్తోంది. దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అనేక చోట్ల రాటమహోత్సవం నిర్వహించారు.

• జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయ కమిటీ, కరాసా రాక్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో పందిరిరాట కార్యక్రమం నిర్వహించారు. విశేష పూజలు చేసి స్థానిక పెద్దలు, యువకులు పందిరి రాట వేశారు. ఈ నెల 22న దేవీ విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 52వ వార్డు వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు జియ్యాని విజయ్, ఉత్సవ కమిటీ సభ్యులు వినోద్ రెడ్డి, గోపి రెడ్డి, రాజమహేష్, శశి తదితరులు పాల్గొన్నారు.

• గోపాలపట్నం శంకర సినిమా హాలు సమీపంలో శివదుర్గా కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు లెంక కార్తీక్, జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి పవన్ సాయి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దొడ్డి సతీష్, చుక్క పైడిరాజు రెడ్డి, సన్ని బాబు, శ్రీను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ ప్రాంతంలో స్థానిక రెబల్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రుల పూజలకు సంబంధించి ముహూర్తపు రాట వేశారు. రెబల్ యూత్ ప్రతినిధులతో పాటు నాయకులు,మహిళలు పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్ నాయుడు,పాట్టిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్‌కాలనీలోబుధవారం కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పందిరి రాట ప్రతిష్ఠించారు. పారిశ్రామిక వేత్త మజ్జి మాలినాయుడు ముందు గణపతి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉత్సవాలు జరపాలని సూచించారు. కార్యక్రమంలో చిట్టి బాబు, శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

తీరం.. పరిశుభ్రం



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న విశాఖ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది

గోపాలపట్నం: తీరప్రాంతాన్ని విద్యార్థులు శుభ్రం చేశారు. తీర ప్రాంత పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన బీచ్ క్లీనింగ్‌లో 88వ వార్డు నరవ ప్రాంతంలో ఉన్న విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని లాసన్స్‌బే కాలనీ వద్ద బీచ్‌లో, వాల్తేర్ డిపో, జాలారి పేట వద్ద వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షుడు ఉమ్మడి మహేష్, ఇంకాయ్స్ డైరెక్టర్ బాలకృష్ణ నాయర్, కాలేజీ కో–ఆర్డినేటర్ కె.వీరు నాయుడు, లైబ్రేరియన్ కారుమూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యంతోనే ప్రగతి



ఏవీఎన్ కళాశాలలో జరిగిన మై భారత్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: మై భారత్ కార్యకలాపాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి విజ్ఞప్తి చేశారు. వికాస్ దినోత్సవం సందర్భంగా మై భారత్, సమసరియా ఫౌండేషన్ సంయుక్తంగా కాలేజీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎ. అర్చన మాట్లాడుతూ మై భారత్ వికాస్ దివస్ వేడుకలు కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత ఆర్. లీలా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం ఉందన్నారు. స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంస్కరణలు, జాతీయ అంతర్జాతీయ సంబంధాల గురించి వివరించారు. కార్యక్రమం అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మై భారత్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సింహాచలేశుడికి ఘనంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఘనంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో వేంజేపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో ఊరేగించారు. విశేషంగా హారతులు సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

కబడ్డీ పోటీల విజేత విశాఖ మహిళా కళాశాల



విజేతగా నిలిచిన జట్టు సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణలో భాగంగా కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విజేతగా సీహెచ్ ఊర్మిలా అండ్ టీం నిలిచింది. రన్నరప్‌గా డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన సీహెచ్ భాగ్యశ్రీ అండ్ టీం గెలిచింది. మూడవ స్థానంలో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వి.లావణ్య అండ్ టీం నిలిచింది. పోటీలు ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ కబడ్డీ వంటి సాంప్రదాయ ఆటలు మన సంస్కృతిని ప్రతిబింబించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్‌లో ఉన్నత స్థాయి పోటీలకు మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.